

అకాల వర్షం

కుల్కచర్ల మండలంలో బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. 10లో▸



పంద్రాగస్టులోపు రుణమాఫీ

పంద్రాగస్టులోపు రైతు రుణమాఫీ చేసి తీరుతామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. 10లో▸



కాసానిని గెలిపించుకుందాం

బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పిలుపునిచ్చారు. 11లో▸

న్యూస్‌రీల్

రంజిత్‌రెడ్డిని ఆదరించాలి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



రోడ్ షోలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ఎమ్మెల్యేగా తనను ఏ విధంగా దీవించారో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని కూడా ఆశీర్వదించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ కోరారు. బుధవారం వికారాబాద్ మండలం మైలార్‌దేవరాంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే రంజిత్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

దౌల్తాబాద్: మండలంలోని చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.2,66,050 నగదు పట్టుబడింది. కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో నగదు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీశైలంయాదవ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేల మించి నగదు తరలించరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ముత్తురాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఆ పార్టీలను చిత్తుగా ఓడించాలి

బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

బంట్వారం: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమని బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. కేసీఆర్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు.ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాగానే కరెంటు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మహేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు

అనంతగిరి: ఇంటర్ మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ మే 9వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ ఆఫీసర్ ఎన్ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఇంటర్ బోర్డు రానున్న విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగన్న



మర్పల్లి: ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీబీఎన్ నాగన్న నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీహరి బుధవారం నియామక పత్రం అందజేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలను ఏకతాటిపైకి తెచ్చి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం నాగన్న మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు



గ్రంథం.. అనుబంధం

వికారాబాద్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రంథాలయాలు కొండంత అండగా నిలుస్తున్నాయి. నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలన్నీ అందుబాటులో ఉంచుతున్నారు. యువత చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నారు. వారి కోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేశారు. ఆన్ డిమాండ్ బుక్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నారు. అభ్యర్థులకు ఏ పుస్తకం అవసరమో తెలుసుకొని డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం పుస్తకాలను కొనుగోలు చేసి అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతున్నారు.

అందుబాటులో 3.20 లక్షల పుస్తకాలు

జిల్లా కేంద్రం తోపాటు మండలానికి ఒక్కటి చొప్పున 18 శాఖా గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 12,886 మందికి సభ్యత్వం ఉంది. 3.20లక్షల పుస్తకాలు ఉండగా 40 వేల పైచిలుకు పుస్తకాలు పోటీ పరీక్షలకు సంబంధించినవే. నిధుల కొరత కారణంగా ఆశించిన స్థాయిలో పుస్తకాల కొనుగోలు చేయడం లేదని పాఠకులు పేర్కొంటున్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన రెండు వేల పైచిలుకు పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. జూనియర్ అసిస్టెంట్, కానిస్టేబుల్, టెట్ మొదలుకొని ఐఏఎస్, ఐపీఎస్ పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు ఉన్నట్లు గ్రంథాలయ శాఖ పేర్కొంది.

నిరుద్యోగులకు కొండంత అండగా గ్రంథాలయాలు

- అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు
- జూనియర్ అసిస్టెంట్ మొదలుకొని ఐఏఎస్ వరకు ప్రిపేరయ్యేలా..
- ప్రత్యేక షెడ్ల ఏర్పాట్లు
- డిమాండ్ ఆధారంగా బుక్స్ కొనుగోలు

సిబ్బంది కొరత

ఇటీవల కాలంలో గ్రంథాలయాలకు పాఠకుల తాకిడి పెరిగింది.ముఖ్యంగా నిరుద్యోగులు ఎక్కువగా వస్తున్నారు. అయితే సిబ్బంది కొరత సమస్యగా మారింది. జిల్లాలోని 18 గ్రంథాలయాలకు 38 మంది ఉద్యోగులు అవసరం. కేవలం ఏడుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీ గానే ఉన్నాయి. గ్రంథాలయ సంస్థ జిల్లా సెక్రటరీ మరో జిల్లాకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.ఒక్కో ఉద్యోగి రెండు మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జులుగా వ్యవహరించాల్సి వస్తోంది. బొంరాస్‌పేట్, కొడంగల్,దౌల్తాబాద్‌లోని లైబ్రరీలకు ఇన్‌చార్జులే దిక్కయ్యారు.దీంతో రెండు రోజులు తెరుచుకుంటే మరో రెండు రోజులు మూతబడుతున్నాయి.

ప్రత్యేక ఏర్పాట్లు



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం జిల్లా గ్రంథాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఫలానా పుస్తకం కావాలి రిజిస్టర్‌లో నమోదు చేస్తే అందుబాటులో ఉంచుతున్నాం. నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి.

– సురేష్‌బాబు, సెక్రటరీ, జిల్లా గ్రంథాలయ సంస్థ

'గ్యారంటీ'గా నిలదీయండి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత
- ఓటమిని గ్రహించే కొడంగల్‌కు ఆరుసార్లు సీఎం రేవంత్
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని తుంకిమెట్ల శివారులో మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను ఆరు గ్యారంటీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతుబంధు, రుణమాఫీ పథకాల అమల్లో విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ బస్సు యాత్రకు భయపడే రైతుబంధు డబ్బు వేశారని పేర్కొన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికలను పట్టుదలగా తీసుకోని గెలుపే లక్ష్యంగా సాగాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలే ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటమిని గ్రహించే సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి ఆరుసార్లు వచ్చారని తెలిపారు. కరీంనగర్, వరంగల్, సికింద్రాబాద్ తోపాటు మరో ఎనిమిది ఎంపీ సీట్లను తాము సొంతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి నరేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు మహేందర్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, యాదగిరి, సుదర్శన్‌రెడ్డి, తిరుపతయ్య, నెహ్రూ నాయక్, మహేశ్, వాహబ్, శ్యామలయ్య గౌడ్, నరేశ్‌గౌడ్, సురేశ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజన సంక్షేమం

- గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్య నాయక్



బెల్యనాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే గిరిజన, ఆదివాసీలకు మేలు జరుగుతుందని రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్యనాయక్ అన్నారు. బుధవారం తాండూరుకు వచ్చిన ఆయన్ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గిరిజనులకు చేసిందేమీ లేదన్నారు. తండాలకు పంచాయతీ హోదా కల్పించినా మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తండాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, పార్టీ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, గణేష్ రాథోడ్, జెడ్పీటీసీ ధారాసింగ్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు

షా సభను సక్సెస్ చేద్దాం

కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపు

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల మైదానంలో ఈ నెల 11న జరిగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. బుధవారం సభాస్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఇతర ముఖ్య నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 11వ తేదీ ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని ప్రజలు వేలాదిగా తరలిరావాలన్నారు. చేవెళ్ల ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కొండా భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ.. పలువురు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నా ఓటు వేసేందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, జిల్లా ప్రభారి కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, రాష్ట్ర నాయకులు కేపీ రాజు, వడ్ల నందు, నవీన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, బుస్స శ్రీకాంత్, కోశాధికారి పోకల సతీష్, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచన
- నియోజకవర్గాలకు పోలింగ్ సామగ్రి కేటాయింపు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, సీ నారాయణరెడ్డి కోరారు. బుధవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గాలకు కేటాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గానికి 12 బీయూలు(బ్యాలెట్ యూనిట్లు), 14 సీయూలు(కంట్రోల్ యూనిట్లు), 6 వీవీ ప్యాట్లను కేటాయించారు. పరిగి నియోజకవర్గానికి 13బీయూలు, 20 సీయూలు, 14 వీవీ ప్యాట్లు, తాండూరుకు 12 బీయూలు, 19సీయూలు, 8 వీవీ ప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి 7బీయూలు, 11సీయూలు, 3 వీవీ ప్యాట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఈవీఎంల నోడల్ అధికారి సుగుణబాయి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ నరసింహారెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పెంపు

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు మే 10వ తేదీ వరకు అవకాశం ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గడవు పొడగించిన ట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

వసతులు కల్పించాలి: అదనపు కలెక్టర్


పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించాలని వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మేరీ ఏనాట్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటర్ల కోసం టెంట్లు, నీటి వసతి, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, ముఖ్య ప్రణాళిక అధికారి అశోక్, జిల్లా లైబ్రరీ కార్యదర్శి సురేష్‌బాబు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసిన సిబ్బంది

పెళ్లింట విషాదం

- వివాహం జరిగిన ఐదు రోజులకే వరుడి దుర్మరణం
- బైక్ పైనుంచి పడి మృతి
- జినుగుర్తి తండాలో ఘటన



పెళ్లినాటి ఫొటో



ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యులు, బంధువులు

తాండూరు రూరల్: అప్పటి వరకు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో సందడిగా ఉన్న ఆ ఇంట్లో విషాదం నెలకొంది. వివాహం అయిన ఐదు రోజులకే వరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.దీంతో ఇరు కుటుంబాల్లో రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటన తాండూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది.కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..జినుగుర్తి తండాకు చెందిన ముడావత్ సురేష్ (25) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు.ఇదే మండలంలోని పర్వాతా పూర్‌కు చెందిన యువతితో ఈ నెల 3న వివా హం జరిగింది. మంగళవారం నూతన వరుడు సురేశ్‌ను అదే తండాకు చెందిన కడావత్ సురేష్ బైక్‌పై బయటకు తీసుకెళ్లాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా తండా సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వెనకాల కూర్చు న్న వరుడు సురేష్ తలకు తీవ్రగాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సురేష్ మృతితో ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

ఓటే.. లైటే!



ఓటింగ్‌కు దూరంగా చేవెళ్ల లోక్‌సభ పరిధి ప్రజలు

- ప్రతి ఎన్నికల్లో తక్కువ శాతం నమోదు
- గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే అధికం
- ఈసారైనా ఈసీ కృషి ఫలించేనా?


సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఐటీకి కేంద్ర బిందువైన చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలో తక్కువ ఓటింగ్‌శాతం నమోదవుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉన్నత చదువులు చదివిన ఉద్యోగస్తులు, ఓటుహక్కుపై అంతో ఇంతో అవగాహన ఉన్నవారే ఇక్కడ అధికంగా ఉంటారు. అయితే ఓటింగ్ రోజున మెజార్టీ పౌరులు పోలింగ్ బూత్ వరకు వచ్చి తమ ఓటుహక్కును ఉపయోగించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. క్యూలైన్‌లో నిలబడే ఓపిక లేకపోవడం, ఓటింగ్ రోజును హాలీడేగా భావించి టూర్లకు, దైవదర్శనాలకు వెళ్లడం ఇక్కడి వారికి అలవాటుగా మారిందనే విమర్శలూ లేకపోలేదు.

గ్రామీణ ఓటర్లే బెటర్..!

ఐటీ పరిశ్రమ బాగా విస్తరించడంతో పాటు అక్షరాస్యత ఎక్కువగా ఉన్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతీ ఎన్నికల్లో అతి తక్కువ ఓటింగ్ నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ఉదాహరణ ఈ ప్రాంతంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతంతో పోలిస్తే.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 12శాతం తక్కువగా పోలింగ్ నమోదైంది. అయితే అక్షరాస్యత తక్కువగా ఉండే పల్లెల్లో మాత్రం పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. పల్లెల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదువుతోంది.

ఆశించిన చైతన్యం రావడం లేదు..

గత లోక్‌సభ ఎన్నికల్లో అనేక ప్రాంతాల్లో త్రిముఖ పోటీ నెలకొనడంతో ఓటింగ్‌శాతం పెరుగుతుందని అంతా భావించారు. అయితే ఆశించిన స్థాయిలో ఓటింగ్ పెరగలేదు. ఓటింగ్ తగ్గుదల అభ్యర్థుల గెలుపోటములపై తప్పకుండా ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఓటింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అనేక చర్యలు చేపడుతున్నా.. ఆశించిన స్థాయిలో ఓటర్లలో చైతన్యం రావడం లేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 53.80 శాతం పోలింగ్ నమోదు కాగా, మల్కాజ్‌గిరిలో 42.75 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అయితే ఈసారి ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతం పెంచేందుకు ఇక్కడ విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతుండటంతో ఓటింగ్‌పై దీని ప్రభావం పడకూడదనే ఉద్దేశంతో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించింది. ఓటరు అవగాహన సమావేశాలు సైతం విస్తృతంగా నిర్వహించింది. ముఖ్యంగా యువత ఓటింగ్‌లో పాల్గొనేలా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఈసారి బద్ధకాన్ని వీడి.. బాధ్యతగా ఓటు వేస్తారో? లేక గత ఎన్నికల మాదిరిగానే వ్యవహరిస్తారో తెలియాలంటే? ఈనెల 13వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.



చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ (2018, 2023), లోక్‌సభ (2019) పోలింగ్ గ్రాఫ్

క్లుప్తంగా

బాలుడిపై కుక్క దాడి


గాయపడిన బాలుడు

తాండూరు టౌన్‌: బాలుడిపై కుక్క దాడి చేసి గాయపర్చిన సంఘటన మంగళవారం రాత్రి తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని 35వ వార్డు ధన్‌గర్‌ గల్లికి చెందిన 12 సంవత్సరాల బాలుడు రాహుల్‌ నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి కుడిచేతి చూపుడు వేలు విరగడంతో పాటు మరో చేతికి గాయాలయ్యాయి. బాధిత బాలున్ని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వీధి కుక్కలు తరచూ చిన్నారులపై దాడి చేస్తున్నాయని తెలిపారు. కుక్కల బెడద పెరిగినప్పటికీ.. మున్సిపల్‌ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కుక్కలకు సంతాన నియంత్రణ (స్టెరిలైజేషన్‌) చేసి, వాటి నుంచి రక్షణ కల్పించాలని కాలనీ వాసులు డిమాండ్‌ చేస్తున్నారు.

‘అంధ విద్యార్థి ఇంటివద్ద మరుగుదొడ్డి నిర్మించండి’

కలెక్టర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశం

అనంతగిరి: చూపులేని విద్యార్థి మాల అభిషేక్‌ ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మాణం చేయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్‌ డాక్టర్‌ సున్నం శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌ నారాయణరెడ్డిని ఆదేశించారు. బషీరాబాద్‌ మండలం కొరివిచేడ్‌ గ్రామానికి చెందిన అభిషేక్‌కు పుట్టుకతో చూపులేదు. ప్రస్తుతం అతను ఢిల్లీ నేషనల్‌ లా యూనివర్సిటీలో 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఇదిలా ఉండగా ‘న్యాయ విద్యార్థి అయిన తమ ఇంటి వద్ద మరుగుదొడ్డి లేక ఇబ్బంది పడుతున్నామని’ ఢిల్లీలోని యాక్సెసిబిలిటీ కమిటీ ఎదుట పలు సమస్యలతో కూడిన అర్జీ పెట్టుకున్నాడు. ఈ దరఖాస్తుకు స్పందించి పరిశీలించిన నోడల్‌ అధికారులు.. సంబంధిత వికారాబాద్‌ న్యాయసేవా అధికార సంస్థకు అర్జీని ఫార్వర్డ్‌ చేశారు. దీంతో పై అధికారుల ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్‌.. అభిషేక్‌ ఇంటి వద్ద స్వచ్ఛ భారత్‌ పథకం ద్వారా మరుగుదొడ్డి నిర్మాణం చేయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

కోరం లేక సమీక్ష వాయిదా

అనంతగిరి: కోరం లేక జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. బుధవారం జరగాల్సిన సమీక్షకు జెడ్పీ చైర్‌పర్సన్‌, ఇతర సభ్యులు హాజరుకాలేదు. దీంతో కోరం లేనందున సమావేశం వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సుధీర్‌ తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

అబ్దుల్లాపూర్‌మెట్‌ సీఐ అంజిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్‌: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం, బీసీ కాలనీల్లో అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీసులు, కేంద్ర బలగాలు కవాతును నిర్వహించారు. సీఐ అంజిరెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, రమేశ్‌, సునీల్‌కుమార్‌లతో పాటు 50మంది సిబ్బంది ఆయా కాలనీల్లో కవాతు చేపట్టారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణలో ఎన్నికలు జరిగేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఎలాంటి భయ భ్రాంతులకు గురి కావొద్దంటూ ప్రజలకు భరోసా కల్పించారు.

స్వాగత తోరణం కూలి మహిళ మృతి

మొయినాబాద్‌: బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల స్వాగత తోరణం ఈదురు గాలులకు కూలి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నమంగళారంలో చోటుచేసుకుంది. మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జహీరాబేగం(45) మంగళవారం రాత్రి కూరగాయలకు వెళ్తుండగా వేగంగా ఈదురు గాలులు వీచాయి. గ్రామంలో ఇటీవల బీరప్ప బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఈ గాలికి తోరణం కూలి మహిళపై పడటంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అకాల వర్షం

తడిసిన ధాన్యం
- నేలకొరిగిన విద్యుత్‌ స్తంభాలు
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలంటున్న రైతులు


కుల్కచర్ల: తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతులు

కుల్కచర్ల: మండలంలో బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో కుల్కచర్ల మార్కెట్‌ యార్డులో ఆరబోసిన, బస్తాల్లోని వరి ధాన్యం తడిసిపోయింది. సుమారు వెయ్యి బస్తాల ధాన్యం నీటిపాలయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం తగ్గిన తరువాత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌ మొగులయ్య ఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. అధైర్య పడరాదని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గాలీవానకు ఆయా గ్రామాల్లో సుమారు పది విద్యుత్‌ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్‌ సీఈఓ బక్కారెడ్డి తదితరులు సందర్శించారు.

కోతకు వచ్చిన పంటలు..

బొంరాస్‌పేట: ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కారణంగా వరి ధాన్యం నీటి పాలయింది. సాయంత్రం మండల పరిధి బొంరాస్‌పేట, మెట్లకుంట గ్రామాల్లో కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి పంటలు నేలకొరగగా.. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యం చూసిన అన్నదాతలు విలపించారు. ఆరబెట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మరో రెండు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే మరింత నష్టపోతామని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, టార్పాలిన్‌ కవర్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.


కుల్కచర్ల: తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న పీఏసీఎస్‌ చైర్మన్‌ మొగులయ్య

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

దౌల్తాబాద్‌: విద్యుదాఘాతంతో కిరాణ దుకాణం దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సలీం కిరాణ షాపు నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి దుకాణం మూసి, ఇంటిపైన నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో షాపు నుంచి పొగలు రావడం చుట్టుపక్కల వారు గమనించారు. దుకాణం తెరిచి చూడగా.. మొత్తం మంటలతో కూడిన పొగ ఆవహించి ఉంది. వెంటనే స్థానికులు మంటలను ఆర్పారు. ప్రమాదంలో సుమారు రూ.3లక్షల విలువగల సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఈ మేరకు మాజీ సర్పంచ్‌ శిరీష.. బాధితుడికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.


దుకాణంలో కాలిపోయిన సామగ్రి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాండూరు రూరల్‌: మండల పరిధి గోనూర్‌ గ్రామంలో డీసీఎంఎస్‌ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా.. బుధవారం డీసీఎంఎస్‌ ఇన్‌చార్జి మేనేజర్‌ ఎల్లప్ప దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల పరిధి గోనూర్‌, బెల్కటూర్‌, చెంగోల్‌లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు ఇప్పటి వరకు 20 వేల ధాన్యం బస్తాలు అందజేశామని పేర్కొన్నారు. గ్రేడ్‌–ఎ రకం వరి ధాన్యంకు రూ.2,203, గ్రేడ్‌–బి రకానికి రూ.2,183 ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందని చెప్పారు.


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎల్లప్ప

పోలింగ్‌ ప్రశాంతంగా జరగాలి

డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మోమిన్‌పేట: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ ప్రక్రియ ప్రశాంతంగా జరగాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి సమస్యాత్మకమైన 8 పోలింగ్‌ స్టేషన్లను డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఈ కేంద్రాల పరిధిలో ఉన్న సంఘ వ్యతిరేక శక్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలింగ్‌ సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొరంగపల్లిలో రెండు, మోమిన్‌పేటలో ఐదు, చీమల్‌దరిలో ఒక కేంద్రాన్ని సమస్యాత్మక మైనవిగా గుర్తించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేంద్రాల్లో పోలీస్‌ బందోబస్తును ఎక్కువగా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ అరవింద్‌ తదితరులు ఉన్నారు.


పోలింగ్‌ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

మర్పల్లి: పార్లమెంట్‌ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండల పరిధి పట్లూర్‌, పంచలింగాల, సిరిపురం మర్పల్లి సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెట్టాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాల పోలింగ్‌ కేంద్రాలను ఆయన తనఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎస్పీ వెంట మోమిన్‌పేట్‌ సీఐ ఆంజనేయులు, స్థానిక ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డిలు ఉన్నారు.

పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

సహాయ రిటర్నింగ్‌ అధికారి శ్రీనివాస రావు

తాండూరు టౌన్‌: పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ గడువును రేపటి వరకు పొడగించినట్లు తాండూరు సెగ్మెంట్‌ సహాయ రిటర్నింగ్‌ అధికారి శ్రీనివాస రావు తెలిపారు. ఫారం–12 ద్వారా పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలుత ఎలక్షన్‌ కమిషన్‌ బుధవారం వరకు గడువు ఇచ్చింది. అయితే మరో 306 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోకపోవడంతో గడువును శుక్రవారం వరకు పొడగించినట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న 1,638 మంది ఎన్నికల సిబ్బందిలో 1,334 మంది ఓటు వేశారని తెలిపారు.



ఏఆర్వో, ఆర్డీఓ శ్రీనివాసరావు

అలాగే ఆర్టీసీ, మెడికల్‌, ఫైర్‌ సిబ్బంది వంటి పలు అత్యవసర సర్వీసులకు సంబంధించిన ఉద్యోగులు 72 మంది దరఖాస్తు చేసుకోగా.. 70 మంది ఇప్పటికే ఓటు వేసినట్లు పేర్కొన్నారు. ఓటు వేయని వారు 10వ తేదీ లోగా పట్టణంలోని ప్రభుత్వ నంబర్‌ వన్‌ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్‌ ఫెసిలిటేషన్‌ సెంటర్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు తమ హక్కును వినియోగించుకోవాలని ఏఆర్‌ఓ, ఆర్డీఓ సూచించారు.

భవనం పైనుంచి పడి కూలీ మృతి


వెంకటయ్య (ఫైల్‌)

తాండూరు టౌన్‌: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ కూలీ దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన తాండూరు పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట మండలం జానకంపల్లికి చెందిన మోత్కూరు వెంకటయ్య(42) పట్టణంలోని హసన్‌నగర్‌కు చెందిన వ్యాపారి ఖుర్షీద్‌ హుస్సేన్‌ ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. మూడో అంతస్తు భవనం నాలుగో అంతస్తుకు పనులు చేస్తుండగా.. రేయిలింగ్‌ కూలింది. ఈ ప్రమాదంలో కిందపడిన వెంకటయ్యపై గోడ పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కూలీ పక్కకు దూకడంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, శిథిలాలను తొలగించి, మృత దేహాన్ని బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా సదరు ఇంటి యజమాని ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నాలుగు అంతస్తు నిర్మిస్తున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు.


శిథిలాల కింద వెంకటయ్య మృత దేహం

గుర్రంగూడలో కారు బీభత్సం

- విద్యుత్‌ స్తంభం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన వైనం

మీర్‌పేట: అతివేగంగా వచ్చిన కారు పల్టీకొట్టి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్రంగూడకు చెందిన జ్ఞానేశ్వర్‌ తన సోదరుడి కోసం ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంతో వేచి ఉన్నారు. అదే సమయంలో ఓ కారు అతివేగంగా వచ్చి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టడంతో పాటు అక్కడే బైకుపై ఉన్న జ్ఞానేశ్వర్‌ను ఢీ కొట్టింది. దీంతో జ్ఞానేశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు వేగానికి విద్యుత్‌ స్తంభం కూలి మూడు ముక్కలైందని, ఆ సమయంలో విద్యుత్‌ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని, ఎయిర్‌ బెలూన్స్‌ తెరచుకోవడంతో వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు వివరించారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్‌ కాశీవిశ్వనాథ్‌ తెలిపారు.


పల్టీ కొట్టిన కారు

మార్నింగ్‌ వాక్‌లో ‘కొండా’ ప్రచారం

బడంగ్‌పేట్‌: మున్సిపల్‌ కార్పొరేషన్‌లో అమరుడు సిరిపురం యాదయ్య స్మారక స్టేడియంలో బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌ చేస్తున్న వాకర్లను చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సురక్షితమైన పాలన బీజేపీతోనే సాధ్యమని, అమూల్యమైన తమ ఓటును తనకు వేయాలని కోరారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీరాములు ఉన్నారు.

పంద్రాగస్టులోపు రుణమాఫీ

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం
- ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ‘ఇదీ ప్రజా ప్రభుత్వం. పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తాం. విద్యుత్‌ బిల్లులు కట్టవద్దు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. కలిసి కట్టుగా పనిచేసి, కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం’ అని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే అంగడిచిట్టంపల్లి, మన్నేగుడ, కండ్లపల్లి, సోమన్‌గుర్తి, మేడికొండ గ్రామాల్లో పార్టీ ప్రచార కార్యక్రమాల్లో ఆయన ప్రసంగించారు. బీజేపీ.. రాజ్యాంగాన్ని మారుస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎవరికీ వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని వెల్లడించారు. ఇందులో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, పీఏసీఎస్‌ చైర్మన్‌ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు కండ్లపల్లి శ్రీనివాస్‌, శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్‌, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్‌, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, అజీం పటేల్‌ ఉన్నారు.


పూడూరు: ఇంటింటి ప్రచారంలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

బీజేపీతో ప్రజా స్వామ్యానికి ముప్పు

పరిగి: మోదీ పాలనతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి రావు, మైనార్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు పక్రుద్దీన్‌, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లాల్‌కృష్ణతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం.. బీసీలకు, మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ హయాంలో రైతు సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు తీసుకువస్తే.. బీజేపీ మాత్రం రైతులను ఇబ్బందులకు గురిచేసిందని వివరించారు. దేశంలో బీసీ గణన చేసి, చట్టసభల్లో రిజర్వేషన్‌ కల్పించాల్సిన కేంద్రం.. బీసీలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా చేసిందన్నారు. కావున ఓటర్లు ఆలోచించి, ఓటు వేయాలని కోరారు. ఇందులో కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, శివకుమార్‌ ఉన్నారు.

గుంతలో ఇరుక్కుపోయిన లారీ

షాద్‌నగర్‌: పాత జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వర్షం కారణంగా రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచాయి. మంగళవారం రాత్రి పట్టణంలోని బాలాజీ టౌన్‌షిప్‌ ఎదురుగా ఓ లారీ రహదారి మధ్యలో గుంతలో ఇరుక్కుపోయింది. వర్షానికి పక్కనే ఉన్న చెట్లు కొమ్మ కూడా విరిగిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని వివిధ కాలనీలో ఉన్న చెట్లు ఈదుర గాలులకు విరిగిపోయి విద్యుత్‌ తీగలపై పడ్డాయి. దీంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మొయినాబాద్‌: ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్‌ తీగలకు తగిలి ఓ గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్ద మంగళారంలో చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి రామకృష్ణ బుధవారం ఉదయం గేదెలను వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లాడు. మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్‌ తీగలు తెగిపడ్డాయి. వాటిని గమనించకుండా ఓ పశువు విద్యుత్‌ తీగలకు తగిలింది. దీంతో కరెంట్‌ షాక్‌ తగిలి అది అక్కడికక్కడే మృతి చెందింది. మరణించిన పశువు విలువ సుమారు రూ.1 లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

మైనింగ్‌ కంపెనీ ఏర్పాటు చేయొద్దు


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కలెక్టరేట్‌, ఆర్డీఓకు ముద్విన్‌ గ్రామస్తుల వినతి

కడ్తాల్‌: మైనింగ్‌ కంపెనీ ఏర్పాటు చేయవద్దని మండల పరిధిలోని ముద్విన్‌ గ్రామస్తులు కోరారు. గ్రామ సమీపంలో నల్లగుట్టపై మైనింగ్‌ కంపెనీ ఏర్పాటు అంశంపై పార్లమెంట్‌ ఎన్నికల లోపు అధికారులు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలో మైనింగ్‌ క్రషర్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేయవద్దని, 2022 జులైలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అప్పటి జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు, మైనింగ్‌, పొల్యూషన్‌ కంట్రోల్‌ అధికారులకు నివేదించామని గ్రామస్తులు తెలిపారు. నాడు జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రాలు అందజేశామని వెల్లడించారు. గ్రామానికి కిలో మీటర్‌ దూరంలో ఉన్న నల్లగుట్టపై మైనింగ్‌ కంపెనీ ఏర్పాటు చేస్తే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, సమీప వ్యవసాయ పొలాలు, వన్యప్రాణులకు ఇబ్బందులు తలెత్తుతుందని వాపోయారు. కుల వృత్తుల వారు జీవనోపాధి కోల్పోతారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం కొంత మంది నల్లగుట్ట సమీప రైతులను కలిసి మైనింగ్‌ చేపట్టడానికి వచ్చామని తెలపడంతో భయాందోళనకు గురయ్యాని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని, మైనింగ్‌ కంపెనీకి ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా వ్యవహరిస్తే పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తామని ముద్విన్‌ గ్రామస్తులు హెచ్చరించారు.

నల్లగుట్టను పరిశీలించిన ఆర్‌ఐ

తహసీల్దార్‌ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నల్లగుట్టను ఆర్‌ఐ వాహిద్‌ సందర్శించారు. పరిసర ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి మైనింగ్‌ పనులు చేపట్టలేదని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఆర్‌ఐని కలిసి, మైనింగ్‌ కంపెనీకి అనుమతులు నిలిపి వేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

మీ ఇంటికే వస్తున్నామమ్మా..

- కూతురుకు ఫోన్‌చేసి చెప్పిన తల్లిదండ్రులు
- ఆ తర్వాత కొద్ది క్షణాలకే రోడ్డు ప్రమాదం
- కారును ఢీకొట్టిన లారీ
- తండ్రి దుర్మరణం, తీవ్ర గాయాలపాలైన తల్లి

కందుకూరు: ప్రశాంతంగా దైవ దర్శనాన్ని చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో కాసేపట్లో తమ కుమార్తె ఇంటికి చేరుకుంటామని ఆ దంపతులు మురిసిపోయారు. కానీ లారీ రూపంలో వచ్చిన మృత్యువు భర్తను కబళించగా, భార్యను తీవ్ర గాయాల పాలు చేసింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం షేక్‌మహ్మద్‌పేటకు చెందిన చింతలపూడి దుర్గాప్రసాద్‌(65) భార్య సరోజతో కలిసి హైదరాబాద్‌ మలక్‌పేటలో నివసిస్తున్నారు. దుర్గాప్రసాద్‌ ప్రభుత్వ ఆడిట్‌ డిపార్టుమెంట్‌లో పని చేసి రిటైరయ్యారు. కుమారుడు అమెరికాలో సెటిల్‌ అవగా.. కుమార్తె తుక్కుగూడ మున్సిపల్‌ పరిధి రాంకీ విల్లా వెంచర్‌లో ఉంటున్నారు. గత సోమవారం దుర్గాప్రసాద్‌ దంపతులు కారులో దైవ దర్శనానికి శ్రీశైలం వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి బయలుదేరారు. కందుకూరు వద్దకు రాగానే సమీపంలో ఉన్న కూతురుకు ఫోన్‌ చేసి ‘మీ ఇంటికే వస్తున్నామమ్మా’ అని చెప్పారు. మరికొద్ది క్షణాల్లో గమ్యం చేరుకోవాల్సి ఉండగా.. శ్రీశైలం రహదారిపై పెద్దిరెడ్డి వెంచర్‌–కొత్తూర్‌ వాగు మధ్య ఎదురుగా వస్తున్న లారీ వీరి కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవింగ్‌ సీటులో ఉన్న దుర్గాప్రసాద్‌ తీవ్రంగా గాయపడి ఇరుక్కుపోయారు. సరోజకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వాహనంలో ఇరుక్కుపోయిన దుర్గాప్రసాద్‌ను, సరోజను స్థానికులు అతి కష్టంగా బయటకు తీసి 108 అంబులెన్స్‌ వాహనంలో ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దుర్గాప్రసాద్‌ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సరోజ చికిత్స పొందుతోంది. ఈ మేరకు సీఐ మక్బూల్‌జానీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


దుర్గాప్రసాద్‌ మృతదేహం


ప్రమాదంలో షాక్‌కు గురైన సరోజ